పన్నీటి చోటు
కన్నీటి బాటు

బొడ్డు బాపిరాజు

చల్లని వెన్నెల కురుస్తున్న చందమామని కారుమబ్బు కబళించినట్లయింది. మహేంద్రకు మాలతి మాటలు వినగానే ఆనందం చిందులాడుతూ వున్న ముఖాన చీకట్లు ముసిరాయి.

మాలతిని మొదటిసారి చూచినప్పుడే యిన్నాళ్లూ తను వెదుకుతున్న దీ తీవ కోపమే అనుకున్నాడు. పాణిగ్రహణంతో అనురాగ ద్వారాలు తెరుచుకొన్న అతని హృదయ మందిరంలో అడుగుపెట్టిన ఆనంద కిరణాలు అదృశ్యమయిపోయాయి మాలతి మాటతో. వచ్చిం దనుకొన్న వసంతాన్ని అకాల శిశిరం ఆక్రమించి నట్లయింది. కానిపని కళ్ల ముందు జరిగిపోతూ వున్నట్టు మహేంద్ర మనస్సులోనే మథన పడిపోతూ వున్నాడు.

'అబ్బా!' అంటూ బాధతో భర్త నోటినుంచి వేలు లాక్కొని పడిన గాట్లు మీద నోటితో వూదుకొంటూ

'ఏమిటా మోటు సరసం' అనబోయి భర్త మొగం వేపు చూచిన మాలతికి మాట పెగల్లేదు. ఎంతో సిగ్గుతో చెప్పలేక చెప్పిన తన మాటకు ఎంత హంగామా చేస్తారో అనుకొన్నదే కాని యిలా కళ తప్పిన మొగంతో భర్త కళవళపడడం ఆ ముగ్ధ హృదయానికర్థం కాలేదు.

'ఏమిటలా అయిపోయారు? ఏదన్నా బాధగా వుందా అండీ?' పొంగి వస్తున్న దుఃఖాన్ని మ్రింగుకుంటూ మాలతి అడిగే మాటలు వినిపించుకొనే స్థితిలో లేడు మహేంద్ర.

పూసిన పువ్వుతోటలా ఆకాశం అలుముకున్న తెల్లని వెన్నెట్లో పడక కుర్చీలో పవళించి, ఈ క్షణం అన్నాళ్ళూ తన కోసం ఎంత తపించి పోయిందీ — తనెన్నిసార్లు కలల్లో కనిపించి కవ్వించిందీ — కమ్మగా కబుర్లు చెబుతూ వున్న భర్త ప్రక్కన పేము కుర్చీలో కూర్చుని ముసిముసి నవ్వుల్తో వింటూ, వక్కపొడి అందించి— కవటాకులేరి సున్నం రాసి — ఈనెలు తీసి— తమలపాకు చిలకలు చుట్టి నోటి కందిస్తున్న మాలతి చెప్పనా వద్దా అనుకోవడంలో ఎరుపెక్కిన చెక్కిళ్ళూ విచ్చుకుంటూ వున్న పెదవులు చూస్తూ అడగవే అడిగాడు మహేంద్ర.

'ఏమిటోయ్ ఆ దే రహస్యం? ఈ దాసుని చెవిన కూడా పడనీయి. నీకే పుణ్యముంటుంది.'

మాలతి వస్తూ వున్న నవ్వును పెదవుల్లోనే బిగించి 'ఏమీ లేదు — లేదండీ' అంటూనే పవడంలా పండిన పోరు పెనిమిట చెవిదగ్గర పెట్టి మంద్రంలో సరిగమలు పలికినట్లు 'మీకు అబ్బాయ్ కావాలా? అమ్మాయ్ కావాలా?' అంటూ మాట ముగించకుండానే సిగ్గులో మునిగి పోయింది.

అంతే వినరాని మాట విన్నట్లు కంగారు పడిపోయి మడుపు లందిస్తూ వున్న మాలతి వేలు కసిక్కిన కొరికాడు మహేంద్ర.

* * *

మహేంద్ర మంచివాడే. ఆలోచనకన్నా ఆవేశం పాలెక్కువ. ఇష్టానిష్టాల్ని మనసు ఏ భూతద్దంతో చూస్తుందో మరి. అందరికీ అతి సామాన్యమయిన విషయమే అతనికి వింధ్య పర్వతంలా పెరిగిపోతుంది. అతని అభిరుచుల్ని మెచ్చుకున్నా బలహీనతల్ని హర్షించలేం. రచయిత కాలేదు కాని అతి భావుకుడు. వూహా శిఖరాగ్రాల్లో ఉయ్యాలలూగే సౌందర్యప్రియుడు. కనుక కాబోయే పెళ్ళిని గురించి, రాబోయే ఇల్లాలిని గురించి, సాగించే ప్రణయ జీవితాన్ని గురించి, వేగించే విరహ రాత్రుల్ని గురించి రంగు రంగుల చిత్రాలెప్పట్నించో వూహా ఫలకాల మీద చిత్రించుకుంటూ వస్తున్నాడు. ఆ చిత్రంలో ఏ రేఖ మారినా ఏ రంగు చెదరినా అడెంతో దురదృష్టంగా తల్లడిల్లిపోయే తత్వ మతనిది. ఇవన్నీ ఆంతరంగిక విషయాలు. బహిరంగ విషయం, అందమైనవాడు — పట్టభద్రుడు— అవసరం కన్నా అధికంగా గడించిపోయిన పితృ పితామహుల ఆస్తికి ఏకైక వారసుడు.

బంగారు పంజరంలోని ఆ గోరువంక పెండ్లీడుకెదిగిన రామచిలుకల కన్న తండ్రుల కెందరికో కన్నులూరించింది. చాకచక్యంగా పట్టుదారాల్తో ఉచ్చులు పన్నారు. ఏ గాలానికి చిక్కలేదా బంగారు చేప.

'ఇక మనవాడికీ జన్మలో పెళ్ళికాదు! భూమండలంలో వాడికంటికి నచ్చేపిల్ల యింకా పుట్టలేదు! బ్రహ్మదేవుడు వాడికోసం ప్రత్యేకంగా ఓ పుత్తడి బొమ్మను సృష్టిస్తున్నా'డంటూ మహేంద్రను గురించి చెప్పుకుని నవ్వుకుంటూ వుండే లోగానే బంధుమిత్రులందరికీ సకుటుంబ సపరివారంగా విచ్చేసి నవదంపతుల నాశీర్వదించ వలసిందిగా శుభలేఖ లందాయి.

పెండ్లిపీటలమీద మాలతిని మహేంద్రదనుచూచిన బంధుమిత్రులంతా 'నిజంగా దేవకన్యే దిగి వచ్చిం'దనుకున్నారు. అందరికన్నా మహేంద్ర అక్క సుభద్ర మరదల్ని చూస్తూ మురిసి ముప్పందు మయింది. ఈ శుభం చూడకుండనే దాటిపోయిన తండ్రిని తలుచుకుని ఉబికిన కన్నీళ్ళెవరూ చూడకుండా చెంగుతో అద్దుకుంది.

మనుగుడుపుల్లో అకాస్త అడ్డు తీరిందనిపించారు. ఫలప్రదానా లందుకుని మంగళారతి అద్ది అక్షతలుంచిన పెద్ద ముత్తయిదువ 'అష్టయిశ్వర్యాల్తో—అయిదువతనంతో—కడిపెడు బిడ్డల్నికని కలకాలం సుఖించం'డని దీవిస్తున్నప్పుడు మహేంద్ర కపశకునం ఎదురు వస్తున్నట్లనిపించింది.

మెరుపుతీగలా మెరిసిపోతూ మల్లెపూల జడతో మత్తెక్కిస్తున్న సౌరభంతో పరిగంచు చీరతో క్షీరసముద్రంనుంచి బయలుదేరివచ్చిన శ్రీదేవిలావున్న మాలతిని చేతుల్తో చుట్టివేస్తూ 'మరో రెండు చేతులుంటే బాగుండు' ననుకున్నాడు! ఆ అందాన్ని తనివితీరా చూడ్డానికి 'వెయ్యి కళ్ళున్నా చాల'వనుకున్నాడు మహేంద్ర. చంద్రకిరణం చెంగలువతో మంతనాలాడినట్లు, మహేంద్ర తియ్యగా చెపుతూవుంటే, మాలతి పారవశ్యంతో వింటూవుంటే, వాళ్ళ కళ్ళలోని ఎరుపుజీరలు తూరుపు కొండ కొనల్ని వెలిగించాయి.

మాలతికి మనస్పిచ్చివచ్చిన మహేంద్ర తనయింట ఒకకాలు అత్తవారింట ఒక కాలుగా ఆమూణ్ణెల్లూ ఎల్లాగడిపాడో రైల్వేవాళ్ళకే తెలియాలి. వచ్చినప్పుడల్లా వెయ్యికలల్ని వినిపిస్తూ మొయ్యలేనంత విరహం మూటకట్టుకు వెళ్ళేవాడు.

ఆషాఢం అతని ప్రాణానికి ఆడకత్తెరలా దాపురించింది. ఆ నెల్లాళ్ళూ ముత్యాలు ముగ్గులుపెట్టినట్టు మాలతికి వ్రాసిన ఉత్తరాలకన్నా నచ్చక చించివేసినవే ఎక్కువ. అంతకన్నా వ్రాయగాల్సివీ మనస్సులో మిగిలిపోయినవీ మరీ ఎక్కువ. ఆతని విరహతాపాన్ని తీర్చే చల్లని చినుకుల్తో, నీలిమబ్బుల మేలిముసుగు సవరించుకుంటూ శ్రావణం రానేవచ్చింది. 'ఈసారి తనతో మాలతిని ఎలా అయినా తీసుకువెళ్ళా'లన్న స్థిరసంకల్పంతో అత్తవారింటికివచ్చి వ్రాలాడు మహేంద్ర.

కొండంత కోరికల రెక్కలు గట్టుకు వచ్చిన మహేంద్రకు మాలతి మాట వజ్రాయుధంకన్నా వాడిగా తగిలింది. అప్పుడే తండ్రి అనిపించుకోవడమేకాదు అసలు తండ్రనిపించుకోవడమే అతనికిష్టం లేదు. క్రొత్త తీవలకు మొగ్గలు తొడిగే ప్రకృతి ధర్మం అతని యిష్టానిష్టాల్ని పాటించే బాధ్యత కాని, కనికరం కాని వహించలేదు పాపం!

* * *

మన్నీ పసుపుతో ఇల్లు నిండిన సారె సామానుతో నిండుగా వచ్చిన మరదల్ని చూస్తూనే తన కొడుక్కప్పుడే పెళ్ళాం వచ్చినట్టు ఉబ్బిపోయింది సుభద్ర. 'ఓయ్ మరదల మాణిక్యం! మీ అల్లుడు పెళ్ళాం కావాలంటున్నా డమ్మాయ్. 'పట్టి నిస్తా— పాడావు నిస్తా' నని పెళ్ళిలో బొమ్మనప్పగించావ్ గుర్తుందా' అన్న వదినగారికి మాలతి ముసి ముసి నవ్వులే సమాధానాలయ్యాయి. 'ఎవరయితే నేమిలే అమ్మా!

ఆ చెంబుడు నీళ్ళూ చల్లగా పడితే చాలు— 'తొలి చూలు కొడుకూ, తొలికాపు పంటా అంటా'రంటూ పక్కింటి పిన్నిగారన్న మాట 'కంతే నండమ్మగారు' అన్న చాకలి ముత్తాయిదువు బియ్యం-కొబ్బరి కాయా—ఎఱ్ఱనీళ్ళూ—మాలతికి దిగదుడిచి దిష్టి తీశాక కుడికాలు లోపల పెట్టింది క్రొత్త కోడలు.

కోడలు అడుగు పెట్టడంతో ఇంటికి క్రొత్త కళ వచ్చిందంటే వచ్చిందన్నారు నలుగురూ. మహేంద్ర మనస్సులో ముల్లు గ్రుచ్చుకున్న విషయ మెవరికీ పట్టలేదు.

'అదృష్టవంతురాలివి! నీ కడుపున మీ మామగారే వెలుస్తార్లే. వయసులో కన్న కొడుకూ, వయసులో గడించిన ధనం తండ్రి కదువ్లో అక్కరకొస్తా'యంటూ ఎందరెంత ముచ్చటపడ్డా, భర్త ముఖభావం మాత్రం మాలతి గుండెలో కెలుకుతూనే వుంది. 'ఆయన స్వభావం అంతేలే' అని సరిపెట్టుకోలేక పోతూవుంది. తనంటే వున్న ఆ మమతలూ అప్యాయతలూ అన్నీ వట్టి నటనలే అనుకోలేకపోతూవుంది. 'నలుగురూ ఆనందించే విషయంలో ఉభయుల మధ్యా జారిన తెగ ఎన్నాళ్ళకు లేస్తుందో మరి? అయినా తన తప్పేమిటి?' అన్న ఆలోచనల్లో మల్లగుల్లాలు పడుతూ మాలతి ఎంతగా అడిగినా మహేంద్ర సూటిగా తన మనస్సు విప్పలేకా చెప్పలేకా నలిగిపోతున్నాడు.

మల్లెపూవులన్నా మామిడిపళ్ళన్నా అసహ్యపడే వాళ్ళెందరు లేరు. 'ఆ అసహ్యం ఎందు'కని ప్రశ్నిస్తే కారణం వాళ్ళే చెప్పలేకపోవచ్చు. కాని, కారణంలేని కార్యం అంటూ వుండదన్నది యథార్థం.

మహేంద్రకు పిల్లలమీద అసహ్యమే కాదు, అక్కసు కూడాను. వాళ్ళు తల్లి ఆరోగ్యాన్ని, అందాన్ని బలి తీసుకుంటారనీ, తండ్రి సుఖశాంతుల్ని దూరం చేస్తారనీ, విషబీజా లతనికి తెలియకుండానే హృదయంలో మొలకలెత్తాయి. సృష్టికి ఫుల్‌స్టాప్ పెట్టే ఈ భావం లోకకళ్యాణానికి వేరుపురుగన్నది తెలియని అవివేకాన్ని ఎవరు హర్షిస్తారు? బాబిగాడు పుట్టినప్పు డక్కయ్యతో అంటే, 'పోరా పిచ్చి మాలోకం! ఇప్పుడు కాదు రేపు నీకు పుట్టినప్పుడు తెలుస్తుందా తీపి' అని తేలిగ్గా నవ్వేసింది.

తొమ్మిది నెలలు ఆహారంలో ఆహారం, తన రక్తంలో రక్తం పంచిస్తూ పడరాని పాట్లుపడుతూ ఏ మెప్పూ కోరకుండా అన్ని నొప్పులూ సహించి ఆ పసినోటికి వెచ్చని రొమ్ము అందించి వాత్సల్యాన్నంతా పాలుగా పట్టించే క్షమాస్వరూపిణి మాతృమూర్తి ఆ ఆనందంకోసం ఎన్ని తపస్సుల నన్నా ధారపోస్తుందని ఊహించగల హృదయం ఎందరి తండ్రుల కుంటుంది? కడుపున పుట్టిన బిడ్డలకే అది తీర్చలేని రుణం అన్నది గుర్తుండదే!

మహేంద్రకు సుభద్రక్క అంటే అమ్మకన్నా ఎక్కువే. అసలమ్మరూపం మనస్సులో అచ్చుపడీ పడకముందే ఆ యమ్మ కన్నుమూసింది తల్లి పోయేనాటికి మహేంద్రకు ఏడాది వెళ్ళింది. సుభద్రకు పదకొండేళ్ళు వచ్చాయి. పాపం ఆ పిల్లే ఇంటిదీపం ఆరిపోయి దిగజారిన తండ్రికి ఆసరాగా, తమ్ముణ్ణి ప్రాణమొకెత్తుగా పెంచి పెద్ద చేస్తూ వచ్చింది. ప్రక్కలో వేసుకొని పడుకొనేదాకా పాటలుపాడి నిద్ర బుచ్చేది. గుజ్జు ముద్దలూ గోరుముద్దలూ చందమామను రమ్మంటూ వెళ్ళిస్తూ తినిపించింది. పాఠాలు చదివించింది. బడికి పంపించింది. ఒక్కనాడూ పల్లెత్తు మాటనకుండా అమ్మ వాత్సల్యం తన సౌభ్రాత్రం కలబోసి ఇంతవాణ్ణి అంతవాణ్ణి చేసింది. ఆ తమ్ముణ్ణి చూసుకుని మురిసిపోయింది. ఆ అక్కతమ్ముళ్ళ ఆత్మీయత చూచి తండ్రి తృప్తిగా గాలిపీల్చాడు. తమ్ముడికి అక్కచూపు సుగ్రీవాజ్ఞ. అక్క మాట వేదాక్షరం. అక్కంటే ఆరోప్రాణం.

సిరీసంపదా వున్న కుటుంబంలో బుద్ధిమంతుడైన కుర్రవాణ్ణి తెచ్చి సుభద్రకు మూడు ముళ్ళూ వేయించి 'తలమీద బరువు దించుకున్నా' ననుకొనే అంతలో బ్రహ్మదేవుడు ఆ తండ్రి ఆకు కాస్తా చించివేశాడు.

తండ్రి పోయినప్పట్నుంచి ఆ అక్కా బావలే యింటికి కప్పులా—కంటికి రెప్పలా—కాపాడా రతణ్ణి. బావగారి యాజమాన్యంలో భూమి పుట్రా—డబ్బూ దస్త్రం, అక్కయ్య అజమాయిషీలో చదువూ సౌజన్యం పెరిగి మనిషయ్యాడు.

అక్కయ్యకు నెల తప్పిందంటే మహేంద్ర తనూ సంతోషించాడు. కాని మూడో నెలలోనే అక్క తిన్నది ఆలస్యంగా వెళ్ళబోసుకుంటూ వేవిళ్ళతో బాధపడుతూవుంటే, ఆ కడుపులో శిశువుమీద అతనికేదో కోపంగా వుండేది. అక్కయ్య యిదివరకుమాదిరి తిరగలేకపోయినా, అంత నడుం నొచ్చినా, ఇంత నీరసం హెచ్చినా, తల నొప్పికీ—తగని బద్ధకానికీ—అన్నింటికీ ఆ కడుపులో వాడిమీదే కక్షగా వుండేది. దానికి తోడు సుభద్ర కాన్పుకూడా కష్టమే అయింది హాస్పిటల్లో చేర్చారు. పెద్దప్రాణం కూడా దక్కదేమో అన్నంత పనయింది. ఏ దేవుడో మొక్కిన మొక్కులు విని చక్రం అడ్డు వేశాడు. తల్లీపిల్లడు నెల తిరక్కుండానే సలక్షణంగా ఇంటికి చేరుకున్నారు. అక్కయ్య ప్రాణాలో దాగుడుమూతలాడిన ఆ పిల్లడంటే అసహ్యం వేసేది. అక్క పిల్చి 'ఎలా నవ్వుతున్నాడో చూడు మహీ! అచ్చు నీపోలికే! మేనమామ పోలికా మేనత్తచాలికా అంటూ రూరికేపోదు' అంటె 'ఇదో క్రొత్త న్యూసెన్సు' అనుకుంటూ మంచంకేసి మొగమన్నా త్రిప్పకుండా వెళ్ళిపోయేవాడు. ఇంట్లో పుచ్చమడుగులు చూచినా, దొడ్లో ఆరవేసిన బాబు గుడ్డల్ని చూచినా ఏవగించుకొనేవాడు. పసివాడు పోరు పెట్టి ఏడుస్తుంటే 'ఇదెక్కడి తద్దినంరా భగవంతుడా!' అనుకొన్నా అక్కయ్యతో మాత్రం ఏమీ అనలేకపోయేవాడు. ఆమునం కంపుతో అక్కయ్యను చూస్తే కడుపులో దేవేది. కాని అతని అసహ్యాన్ని అక్కయ్యంటే వున్న అభిమానం అంకుశంలాగా అదుపులో పెట్టేది.

ఆ నెలల పిల్లడికి ఉగ్గూ పాలూ ఏదీ క్షణం ఆలస్యంకాకుండా వాడు 'కుంయ్' మంటే 'వస్తున్నారా చిట్టి తండ్రీ!' అంటూ హాజర్ సేవలు చేస్తూ బావగారి అవసరాల్ని అశ్రద్ధచేస్తూవుంటే అక్కయ్య మీద జాలీ కోపం కలిగేవి మహేంద్రకు.

ప్రసవించాక అక్కయ్య రూపే మారిపోయింది. బారెడు పొడుగూ పట్టుకుంటే పట్టెడుండే ఆ జుట్టు ఏమయిపోయిందో చిక్కి చిక్కి చివరకు ఎలుకతోకలా తయా

రయింది. పసిడి శలాకలా వుండే లావణ్యం లావెక్కి మనిషి మంధరగిరిలా అవుతూ వుంది. తను చదువుకుంటూవుంటె విశ్రాంతిగా వచ్చి అదీ ఇదీ మాట్లాడే అలవాటు వాడి పుట్టుకతో బందైపోయింది తను వద్దంటూవున్నా రాత్రిళ్లు పాలు తెచ్చి త్రాగందే వదిలిపెట్టని ఆ అక్కయ్యే 'మహీ! పాలు త్రాగి పడుకో బాబేడుస్తున్నాడురా. మర్చిపోవద్దు'అంటూవున్నదీ రోజున.

ప్రతి అల్పవిషయం ఇంత ఆజ్యం పోస్తూ రోజుకు రోజు కతని ద్వేషాన్ని రాజుకునేట్టు చేసింది. అప్పట్నించీ మహేంద్ర మనస్సులో పిల్లలంటే ఆరని వైరం తీరని కసీ గూడు కట్టుకున్నాయి.

* * *

మహేంద్ర మాలతితో మనస్సులో మాట చెప్పలేకపోతున్నాడు. 'ఎందుకూ ఈ పిల్లపీచు అప్పుడేమన' కంటూ విసుక్కుంటాడు చిరాగ్గా. 'దేవుడిచ్చిందానికి మనమేం చేస్తాం చెప్పండి. ఇప్పుడు వద్దనుకుని కావాలన్నప్పుడు కొనితెచ్చుకోవడానికిదేమన్నా బజారుసరుకా అండి మా శాంతక్క పిల్లలకోసం చెయ్యని వ్రతం మొక్కని దేవుడూ లేడు.' అంటుంది మాలతి

ఇంటి డాక్టర్‌తో ఎబార్షన్‌కోసం సలహా సంప్రతింపులు చేశాడు. 'ఈ పిచ్చిపనుల్తో ఏ టెటానెస్సన్నావస్తే అసలు ప్రాణానికే మోసం తెలుసా' అంటూ మెత్తగా మందలించి పంపాడు. నా వాళ్లనుకున్నవాళ్లతో ఆలోచనడిగితే 'ఎందరున్నారనిరా తొలిబిడ్డకే అంతలా అఘోరిస్తావేందు'కని చనువుగానే 'పచ్చని కాపురంలో చిచ్చుపెట్టుకో'కని కొరడా ఝళిపించరు. డబ్బుకు కానిపని వుండదులే అనుకొని తన అభిప్రాయం మాలతితో చెప్పాడు వుండబట్టలేక. నిప్పులు త్రొక్కినట్లు అదిరిపోయి అతని మొగం చూస్తూ ఏడ్పు ప్రారంభించింది. రెణ్ణాళ్లు అన్నం నీళ్లూ ముట్టకుండా అటుమటించే మరదల్ని ఆరాతీసి సుభద్ర తమ్ముణ్ణి తలవాచేటట్లు చివాట్లుపెట్టి నయభయాల చెప్పి మళ్లా అటువంటి ప్రస్తావన తేనని తమ్ముడితో ఒట్టు పెట్టించి మరీ వదిలింది.

కలిగిన వారింటి ఆడబడుచు కడుపుతో వున్నదంటే ఎన్నో అచ్చట్లూ ముచ్చట్లూ వుంటాయి. సీమంతమేకాదు పూలముడుపూ సూడిదలు ఏవి జరపాలన్నా అటు అత్తవారితో ఇటు అక్కయ్యతో వద్దంటే వద్దని భీష్మించాడు. 'ఆయన కంత యిష్టంలేనప్పుడెందుకు లెండి' అని మాలతే సర్దిచెప్పింది. నెలకు నెల పైబడుతున్న కొద్దీ పచ్చని గన్నేరుపూల చెండులా బంగినపల్లి మామిడి పండులా కంటికి నిండుగా కనిపించే మాలతిలో ఏవేవో దుర్ఘటనలూ దుశ్శంకలూ ఊహించుకుంటూ క్రుంగిపోయేవాడు మహేంద్ర.

మాలతి తల్లివచ్చి శాస్త్రానికింత చలిమిడి వొళ్లోపెట్టి పురిటికి పుట్టింటికి తీసువెళ్లేరోజున, వెడుతున్నట్టుచెప్పి వెళ్లడానికి గదిలోకివచ్చిన మాలతి రెండు చేతుల్లో మొగం దాచుకొని పసిపిల్లవాడిలా ఏడ్చే భర్తనెలా ఓదార్చాలో తెలియక తికమకపడుతూ కంటినిండా నీళ్లు తెచ్చుకుని 'ఆనీళ్లు కాస్త పడ్డాక నెల తిరక్కుండా వస్తే సరికదా' అంటూ అతని కన్నీళ్లు తుడిచి నెన్నుదురు ముద్దుపెట్టుకుని 'ఏం మనిషో ఏదొచ్చినా విపరీతమే!' అన్న స్వగతాన్నే ప్రకాశంగా అంటూ విడవలేక విడవలేక విడిచిపెట్టే పెనిమిటి కౌగిలి నెమ్మదిగా విడిపించుకొని వెళ్ళే మాలతిని మళ్లీ కళ్లారా చూస్తానా అంటూ కలవరం, ఏదో తెలియనిభయం పట్టుకుంది మహేంద్రను

* * *

ఒక చల్లనివేళ మాలతి తేలిగ్గా ప్రసవించినట్టు తల్లీ పిల్లడు కులాసాగా వున్నట్టు టెలిగ్రాం వచ్చింది; అతనూహించుకున్న అశుభాల్నీ అనర్థాల్నీ అన్నిట్నీ అపహాస్యంచేస్తూ. ఒకసారి వెళ్లి చూచి రమ్మని సుభద్ర ఎంతచెప్పినా వెళ్లనంటే వెళ్లనన్నాడు. వెడితే మాలతి 'ఏ ఆకారంలో కనిపిస్తుందో' అని ఏరికోరి తెచ్చుకున్న ఆ అందాలన్నింటికీ ఆఖరి అంకం వచ్చిందిలే' అనుకున్నవాడెలా వెళ్లగలడు. వచ్చి బారసాల చేసుకోవలసిందని వ్రాసిన మామగారికి మాఇంటానవాయితీలేదని వ్రాశాడు.

మాలతి అన్నప్రకారం నెలలోగానే తిరిగి అత్తవారింట అడుగు పెట్టింది పసివాణ్ణెత్తుకుని. భ్రూమధ్య విభూతిరేఖా, కొనతీర్చిన కస్తూరీ తిలకం, కండ్లకు కాటుకా— చెవిలో దూదీ—తాంబూలంతో ఎరుపెక్కిన పెదవులూ—నడికట్టూ—మనిషికి మాతృగౌరవాన్ని కలిగిస్తూ పాలిండ్లూ అన్నిటికన్నా ఆకళ్లలో తల్లినయానన్న తృప్తి వీటితో 'చక్కనమ్మచిక్కినాఅందమే' అన్నట్లున్న మాలతి నయన చంద్రికలా వుంది మబ్బును చూచిన మయూరంలా లాడవించి పోయాడు మహేంద్ర అతని కళ్లలో ఆనంద జ్యోతులు పురివిప్పాయి. చేతులుచాచి మాలతిని దగ్గరకు చేర్చుకుంటూ 'మాలతీ!' అన్నాడు చెవిలో ఏమి చెప్పేవాడోమరి అంతలోనే గదిలోవేసిన పట్టెమంచంమీద పొత్తిళ్లలో బాబు సన్నగా సంగీతం సాగించాడు. 'బాబులేచాడు

వస్తోంటూ మాలతి భర్త చేతులు విడిపించుకుని వెళ్ళింది. మహేంద్ర హృదయ ముడికిపోయింది తిరిగి చూడకుండా గదిలోనించి దూసుకుపోయాడు.

ఆ మర్నాడే బాబు మంచం గదిలోనించి మారిపోయింది వచ్చి పదిరోజులయినా పన్నెత్తి పలకరించనూ లేదు కన్నెత్తి చూడనూలేదు. బాబుకు పాలుపట్టి నిద్రబుచ్చి మాలతి వచ్చేవరకు అలా గుమ్మానికి కళ్ళప్పగించి కనిపెట్టుకుని వుండడం నిత్యకంటకంగా వుంది అక్కడికీ భర్త పరిచర్యల కడ్డురాకుండా బాబు పనులు సర్దుకుపోయినా ఆ నోరూ వాయీలేని వాడు ఎప్పుడేపని పెడతాడో ఎలా తెలుస్తుంది. ఎప్పుడే కొంపో మునిగినట్టు బాబు తన మీద పగ సాధిస్తున్నాడన్నట్టు బాధపడేవాడు మహేంద్ర.

ఒకరోజు మాలతి వద్దంటున్నా వినకుండా [illegible] పట్టు [illegible] బాబును [illegible] కూర్చోపెట్టింది. పావుగంట బట్టంత గడిచిందో లేదో అప్పుడే ఆ పసివాడు బట్ట తడిపి ఏడుపు లంకించుకున్నాడు. ఎక్కడ ఎత్తి పడేస్తాడో ఆ చిరాకు మనిషంటూ ముఖం పాలిపోయి బాబును తీసుకుంది.

బాబు పుట్టుకువచ్చిన క్రొత్తలో ఇరుగమ్మా పొరుగమ్మా పసితనంలావున్న బాబునుగూర్చి ఎంత ముచ్చటపడ్డా, అసలు కన్నతండ్రి అంటింపూ-ఆదరింపూ లేకపోయాక ఏం ప్రయోజనమనుకొనేది. కొడుకుమీద ద్వేషం అయిష్టం ఎందుకో అర్థం అయేదికాదు. తనవల్ల తప్పేమన్నా వున్నదంటే అదీ కన్పడదు. బాబును కనడమే తప్పనుకుంటే తనేం చేయగలదు? ఒంటరిగా తనతో గంటలతరబడి కబుర్లు చెప్పుకుపోయే మనిషి బాబు చంకలో వుంటే చాలు తప్పించుకుపోతాడు. ఆపసికందుచేసిన పాపమేమిటో! ఆయన కంత పలకరించరాని అపకారం చేశాడా వాడు. ఇలా ఆలోచనల్లో వేగిపోయేది మాలతి.

రోజులు గడుస్తున్నాయి. ఆగర్భ శత్రువుల్లావున్న ఆ తండ్రీ కొడుకుల మధ్య అడకత్తెరలో పోకచెక్కలా వున్నది మాలతి పని: నోరులేని ఆ కన్నవాణ్ణి నీళ్ళూ పాలూ చూడకుండా విడిచిపెట్టి వూరుకోనూలేదు. తనంటే ప్రాణమిస్తున్న పెనిమిటిని ఒప్పించనూలేదు, నొప్పించనూ లేదు. 'ఆయన మనస్తత్వం అంతే' అని సరిపుచ్చుకున్నా కన్నపుత్రుని ఎత్తుకుని ముద్దులాడి మురిసిపోయే ఏ జనకుని చూచినా, కొడుకు చెయ్యి పుచ్చుకుని తప్పటడుగులు వేయిస్తూ తన్మయుడైపోయే ఏ కన్నతండ్రి కనిపించినా, పసిబిడ్డణ్ణి ప్రక్కనే పడుకోబెట్టుకుని 'చేతిలో వెన్నముద్ద చెంగల్వ పూదండ' చెప్పి అనిపిస్తూ ఆ తొక్కు పలుకులకానందించే ఏ అయ్యను చూచినా తన కొడుక్కు అటువంటి అదృష్టం లేదుకదా అని ఆ తల్లి ప్రాణం ఆక్రోశించిపోయేది.

'బాబును మీ అమ్మదగ్గిర వదిలి రాకూడదు' అన్న మహేంద్ర ప్రతిపాదన 'నేను వాణ్ణి వదలి వుండలేనండి' అంటూ మాలతి కన్నీళ్ళు పెట్టుకోవడంతో వీగిపోయింది. తను వచ్చే వేళకు గదిలో పడుకుని కేరింతలు కొడుతూ వున్న కొడుకుని చూచి మురిసిపోతూవున్నా, చిన్ని గులాబీ రేకుల్లాంటి చేతివ్రేళ్ళతో రొమ్ములు తడుముకుంటూ లక్కపిడతలాంటి ఆ నోటితో వెచ్చగా పాలు త్రాగే పసివాణ్ణి వదలిపెట్టి పిలవగానే రాలేకపోయినా, మహేంద్ర తన హక్కునీ అధికారాన్ని ఎవరో లాక్కున్నట్టు నీళ్ళుకారిపోయేవాడు. 'పాము చుట్టం పడని విరోధి' అన్నట్టుంది తని వ్యవహారం.

బాబును ప్రక్కనే పడుకోబెట్టుకుని మాలతీ యంత్రం కాఫీకి స్టవ్ వెలిగించి నీళ్ళు పెట్టింది. ఇంతలో ప్రక్కింటి పిన్నిగారు పిలిస్తే వెళ్ళింది. ఇప్పుడిప్పుడే ప్రాకడం నేర్చుకుంటున్న బాబు స్టవ్ మోతా పువ్వులావిరిసిన మంటా వింతగా చూస్తూ అటు నెమ్మదిగా స్టవ్ దగ్గిరకు ప్రాకి చెయి చాస్తున్నాడు. అందడం తరువాయిగా వుంది. అప్పుడే వచ్చిన దాసీ దది చూచి గాభరాగా, 'బాబులోయ్ బాబులో' యంటూ పరిగెత్తి, బాబును చంకనెత్తుకుని 'ఏటి బాబా! బుడత డల్లా అగ్గిదగ్గిర పొరాడుతుంటే తమాషా చూస్తరా? ఇయ్యాళ లేచినేళ మంచిది. మాలతమ్మ కడుపు సల్లగా బిడ్డను సంపాయించుకున్నట్టే!' అంటూ గుమ్మం దగ్గిర నిల్చుని అపాయాని కందుబాటులో వున్న బాబును తియ్యాలన్న భావమే లేని మహేంద్రను చీదరించుకుంటూ మాలతికి విశేషణాల్తో వినిపించింది.

బాబుకు జ్వరం, విరోచనాలు. ఏ పూటకా పూట తగ్గిపోతాయంటూ వాళ్ళూ వీళ్ళు చెప్పిన గచ్చాకు పుచ్చాకు వైద్యాలేవో చేస్తూవచ్చింది. మూడు రోజుల్లో బాబు నీరసించిపోయాడు నీళ్ళవిరోచనాల్తో. మహేంద్రతో మందు తెమ్మనీ — డక్టర్ని పిలవమనీ — రోజూ చెపుతూనే వున్నా ఔననకా కాదనకా వినిపించుకోకుండా వుంటే మరో మూడు రోజులయేటప్పటికి బాబు మరీ డీలాపడిపోయాడు. 'ఎంత యిష్టం లేకపోయినా బిడ్డకు మందన్నా యిప్పించరా!' అనుకుంది. ఆ నిర్దాక్షిణ్యాన్ని చూచి వీది గుమ్మం దాటి యెరగని తనే బాబును డాక్టరింటికి తీసుకువెళ్ళి చూపించి మందు తెచ్చుకుంది.

ఇటువంటి భర్తచేష్టలు చూస్తూ 'బాబుకు కీడు కోరుకుంటున్నారేమో' అనుకొన్న మాలతి మహేంద్ర మానవత్వాన్నే అనుమానించింది

ఏ ముద్దూముచ్చటకు నోచుకోని బాబుకు మంచి రోజు చూచి తనే మామగారి పేరు పెట్టి పిలుచుకుంది మాలతి. ఇంటా బయటా అదే పేరయింది. అదీ మహేంద్ర కిష్టంలేదు. పుణ్యాత్ముడైన తన తండ్రి పేరుకు వీడు తగడని. ఆ తాత చేసిన పుణ్యం ఈ మనుమడు చేసిన పాపం తూయడానికతని వివేకమే ప్రతాసేనాడో చెడిపోయింది

తన అంచనాలు తలక్రిందులై, పడిన అనుమానాలు నిరాధారాలని తేలిపోయాయి మహేంద్రకు. మాలతి కాన్పు కష్టం కాలేదు. ఆ అందంలో మార్పు రాలేదు. ఆదనపు ఆకర్షణే వచ్చింది. తనంటే వున్న శ్రద్ధా భక్తి తగ్గలేదు. తనసేవలో లోటు చేయలేదు అయినా, బాబంటే అయిష్టత అలావే వుంది. దేనికైనా రోజు రావాలి

ఆ యింటికప్పక్రిందనే అలాగే ఒకరి నీడ ఒకరిపై పడకుండా ఒకటి తరువాత ఒకటిగా ఋతువులు మారిపోయాయి. వచ్చినవే మళ్ళీ వచ్చాయి. మనిషి పెరి

గాడు. మనస్సు పెరగలేదు.

* * *

మహేంద్ర వస్తూనే ఒళ్లంతా నల కొట్టినట్టుందని మంచంమీద వ్రాలిపోయాడు. మాలతి నుదురుమీద చెయి వేసి చూస్తే పెనంలా కాలిపోతూవుంది కళ్లు జోతుల్లా వున్నాయి. మాలతి కంగారుపడుతూ డాక్టర్‌కు కబురుచేసింది డాక్టర్ వచ్చి యింజెక్షనిచ్చి 'రేపటికి తగ్గిపోతుందమ్మా' అంటూ ధైర్యం చెప్పి వెళ్లాడు. ఆ రాత్రి మాలతి కంటిమీద కునుకు లేదు. ఇక్కడ భర్తను చూస్తూవుంటే అక్కడ బాబు లేచేవాడు. అక్కడ బాబును జోకొడుతూ వుంటే ఆయన కెలా వుందో అని ప్రాణాలు పీకేవి. అటూ యిటూ తిరగడంలోనే కోడికీ మాలతికీ తెల్లవారింది.

ఆ మర్నాటికే మరీ నీరసించిపోయాడు మహేంద్ర. మూడు నాలుగు రోజులా మందనీ యీ మందనీ మార్చి చూశాడు డాక్టర్. మందుబలంకన్నా రోగబలం ఎక్కువయింది. మహేంద్ర మగత మగతగా జ్వర తీవ్రతలో మూలగడం తప్ప మరోమాటా పలుకులేకుండా పడున్నాడు. ఆ మూలుగు వింటుంటే మాలతి గుండె గుబగుబలాడిపోయేది. ఏ పూట కాపూట రోగం ఒక మెట్టు పైకెక్కుతూవుంటే, మాలతి ధైర్యం ఒక మెట్టు దిగజారుతూవుంది. అటు పిల్లణ్ణీ ఇటు పెనిమిటినీ సంబాళించుకోలేక ఆసరాగా వుంటారని తల్లికీ, అత్తవారింటికి వెళ్లిన సుభద్ర వదినగారికీ అర్జంటుగా రమ్మని ఉత్తరాలు వ్రాసింది.

డాక్టర్ చివరకు టైఫాయిడని తేల్చి క్లోరాం ఫెనికాల్ వాడుతూవున్నాడు. తల్లీ వదినగార్లు వచ్చాక పిల్లాణ్ణి ఒడిలో వేసుకుని టయింప్రకారం మందూ బార్లీనీళ్లూ బత్తాయిరసం భర్తకందిస్తూ ఆ మంచం వదిలిపెట్టలేదు మాలతి. తల్లి బలవంతాన వెళ్లి కంచందగ్గిర కూర్చుని మొక్కు చెల్లించుకునివచ్చేది. బాబు తండ్రివంకే చూస్తూ, వచ్చీరాని మాటల్తో 'నా–న్న–ఆ–యి' అంటూ జాలిగా మొగంపెట్టి చెబుతూవుంటే తల్లి ప్రాణం తరుక్కుపోయేది అమ్మ కాళ్లు రాస్తూవుంటే లేత చేతుల్తో తనూ రాయబోయేవాడు. మందు త్రాగిస్తూవుంటే చూస్తూ నిలబడేవాడు. మేనల్లుణ్ణి చూస్తూవుంటే సుభద్రకు ప్రాత జ్ఞాపకాల్తో కన్నీళ్లు తిరిగేవి. కన్నె తెరవని ఆ తండ్రికి కన్నకొడుకు సేవలు తెలియవు. ఆ భార్యాబిడ్డల అదృష్టం బాగుండి ఆతని సుస్తీ త్వరగా తగ్గాలనేవారు పరామర్శలకు వచ్చిన బంధువులు. అదీ నిజమే! చెట్టునాధారంగా గూళ్లు కట్టుకొన్న పక్షుల అదృష్టం తిన్నగా వున్నప్పుడే తుఫానూ ఆ చెట్టునేమీ చెయ్యలేదు.

'నాన్నకు ఆయి నయంకావాలని దణ్ణం పెట్టు బాబూ!' అని మేనత్త పెట్టిస్తూ వుంటే హాల్లో వెంకటేశ్వరస్వామిపటానికి చిన్ని చేతులు జోడించేవాడు. ఆ పటం కనిపిస్తే చాలు ఆ పసిచేతులు రెండొకటయ్యేవి. కల్మషం అంటని ఆ పసివాడి ప్రార్థనలు ఫలించాయి. మహేంద్రరోగం మందులకే తల వంచిందో, మాలతి సేవా శుశ్రూషలకే లొంగిపోయిందో తిరుగుముఖం పెట్టింది.

మనిషికి కలిమిలోకన్నా లేమిలో, సుఖంలో కన్నా కష్టంలో ఆరోగ్యంలోకన్నా వ్యాధిలో ఆత్మవికాసం ఏర్పడుతుంది. చేసిన దుష్కృతాలు మనస్సును పీడిస్తాయి. మంచితనం

చోటు చేసుకుంటుంది. తనకన్నా పైనొక భగవంతుడున్నాడన్న విశ్వాసం అంకురిస్తుంది. అప్పుడే పశ్చాత్తాపాగ్నిలో పరిశుద్ధమైన మనస్సులో సత్యస్వరూపం గోచరిస్తుంది.

రేపు పథ్యం పెడతారన్న మాటతో అందరి హృదయాల్లో బరువూ దించుకొన్నట్లయింది. గదిలో మహేంద్ర కనుమూసీ మూయనట్లు గది బయట అత్తగారితో సుభద్రక్కయ్య చెప్తున్న మాటలు వింటున్నాడు.

'అమ్మా నాన్నా వేడెంత మగ నలుసు కోసం కలవరించి కలవరించి నిరాశలు చేసుకున్నాక నా తరువాత పదేళ్లకు పుట్టాడు మహేంద్ర. కుల ముద్ధరించే కొడుకు పుట్టాడని ఆనందపడుతూ అరచేతిలో పెట్టుకుని పెంచుతూవున్న అమ్మను చూచి కాలానికి కన్ను కుట్టింది. అమ్మ పోయినప్పుడు మహీ ఈ బాబంత వయసులోనేవున్నాడు. అమ్మపోయిన విచారంతో నాన్నకు చాలా పెద్ద సుస్తీయే చేసింది. మళ్లీ బతికి బట్టకడతాడనుకోలేదు. మహీ అప్పుడు మన బాబు మాదిరే మంచం ప్రక్కనే నా వడిలో కూర్చుని నాన్నను చూస్తూ [illegible]' అనేవాడు. ఏ పటాన్ని చూసినా బాబులానే 'నాన్న ఆయ్‌పోద్' అంటూ దణ్ణం పెట్టేవాడు. ఇప్పుడీ బాబును చూస్తుంటే అంతా ఆ తండ్రి పోలికే కనిపిస్తూవుంది. నాన్న నన్నూ మహీని చూస్తూ కన్నీళ్లు పెట్టుకొనేవాడు నా పెళ్లి చెయ్యలేకపోయానని కొడుకు మంచి చెడ్డ చూడకుండానే వెళ్లిపోతానేమో అప్పుడే ఆయన భయం. మా మేనమామ ఎంత ధైర్యం చెబుతున్నా అసలే దెబ్బతిని వున్నవాడేమో మరీ దిగులు పడిపోయేవాడు అత్తయ్యగారూ! అంత మంచిమనిషిని చూడలేరు [illegible] అనుకోండి. అమ్మ చిన్నవాళ్లన్నా కాక మునుపే 'మా పిల్లనిస్తాం మా పిల్లనిస్తాం' అంటూ ఎగబడ్డా మూగేవాళ్లు. ఎన్ని సంబంధాలు వచ్చినా ఎందరయిన వాళ్లూ కానివాళ్లూ బలవంతం చేసినా నాన్న పెళ్లి తలపెట్టలేదు 'నా పిల్లలే నా రెండు కళ్లను. నా సుఖంకోసం ఆ కళ్ళను పొడుచుకోలేను. లోకంలో సవతి తల్లుల నెంతమందిని చూడ్డంలేదు. నా బిడ్డలకే

నవనీతచోరా పోక్కా వద్దండి బాబుగా! అంటూ అందర్నీ కాదని ప్రాణమొకెత్తుగా మమ్మల్ని పెంచుకొచ్చాడా మహానుభావుడు ఏ లోకానున్నాడో!

ఇప్పటివాళ్ళవే చెప్పాలి. చంకలో పిల్లాణ్ణిలా పడేసి షర్టుకు గుండీలు పెట్టమంటూ పెళ్ళాన్ని అమల్‌దుమల్ చేయమంటే చేస్తారు. ఉచ్చులూ పీతులూ నీ వంతు, ముద్దూ ముచ్చటా నా వంతు అనేవాళ్లే యిప్పుడందరూ...

సుభద్ర యింకా చెపుతూనేవుంది పాత విషయాలు వింటూవున్న మహేంద్రకు క్రొత్త కన్నేదో తెరుచుకున్నట్టయింది. అలల్లాగా ఆలోచనలేవో వస్తున్నాయి. తన తప్పులేవో పుస్తకం పుటలు తెరిచినట్లు గోచరిస్తున్నాయి తన అపోహల్ని భయాల్ని వట్టి భ్రమలంటూ కాలం మేలుకొల్పినా తనింకా ముసుగు తన్ని నిద్రపోతున్నాడు. కళ్ళముందు తండ్రే కనిపిస్తున్నాడు. తన తల్లిదండ్రులు 'వంశం ఎలా నిలుస్తుందా' అని తను పుట్టేదాకా తపించిపోయారట. తని లాగా వంశాంకురమే వద్దు అనుకోలేదు. తన మేలుకోరి తన బరువూ బాధ్యతలు స్వీకరించడంకోసం శారీరక సుఖాన్ని తుచ్ఛంగా భావించి మళ్ళీ పెళ్లి తలపెట్టకుండా భీష్మించాడు తన తండ్రి. కానీ తన కొడుకుని తన సుఖం కొల్లగొట్టటానికి వచ్చిన పగవాణ్ణిగా చూశాడు. ఆ అమృతోపమానమైన వాత్సల్యాన్ని త్రాగి పెరిగిన తాను బాబంటే ద్వేషాన్ని వెళ్ళగక్కాడు. అతి పవిత్రము, భగవత్ప్రసాదితమైన పుత్రప్రేమను అల్ప వాంఛలకు బలిచేసుకుంటూవున్న బలహీనుడు తాను. ప్రక్కనున్న చల్లని కోనేటిని కాదని ఎండమావుల్లో దప్పిక తీర్చుకోవాలని యిన్నాళ్లూ పరిగెత్తుతున్న అవివేకి తను.

మనిషి మనస్సు విచిత్రమయింది. తన సంకల్పాన్ని బుద్ధిబలంతో వాదించి అవునని పించనూ కలదు. ఆ సంకల్పాన్ని అదే బుద్ధిబలంతో ప్రతికూల సాక్ష్యాలు సమకూర్చి కాదనిపించనూ కలదు. రెండు వేపులా పదునున్న ఆ కత్తిని కన్ను చెదరకుండా కాలుజారకుండా వాడుకోగలవాళ్ళు ఏ కొద్దిమందో.

పన్నీటి ఊట...

అనుమానపు పాషాణాలడ్డుకున్న మహేంద్ర వాత్సల్యవాహిని రెట్టించిన వేగంతో నిరాటంకంగా ఎగచిమ్మింది. మబ్బు విడిచిన ఎండలా అతని మనస్సు తేజస్సుతో అతిస్వచ్ఛంగా వెలుగుతూంది

'మాలతీ!' అన్న పిలుపుకు 'ఏమండీ' అంటూ గదిలో కాలుపెట్టి 'బత్తాయి రసం తెమ్మంటారా?' అన్న భార్యమాట వినిపించుకోకుండానే 'బాబేం చేస్తున్నాడు' అన్న భర్త ప్రశ్న వినడం విన్నా అర్థం స్ఫురించనట్టు అతనికేసి చూస్తూ వుండిపోయింది. పుట్టిన యిన్నాళ్ళకు ఆయన నోట 'బాబు' అన్న ఆ రెండక్షరాల మాట వింటుంటే ఏమర్థమవుతుంది? 'మన బాబేం చేస్తున్నాడు మాలతీ' అన్నాడు మళ్ళీ, మహేంద్ర.

అప్పుడే వచ్చిన సుభద్ర 'బాబిప్పుడే నిద్రలేచాడు. ప్రక్కింటి పార్వతి తీసుకు వెళ్ళినట్టుంది' అంటే అక్కయ్యను వెళ్ళి తీసుకురమ్మని ఆ అక్క వెళ్ళి తీసుకు వచ్చేలోగానే మహేంద్ర తహతహలాడిపోయాడు క్షణం యుగంలాగా.

సుభద్ర గగ్గోలుగా ఏడుస్తూ వచ్చింది; చేతుల్లో చంటివాణ్ణెత్తుకుని. మాంసం ముద్దలా వున్నాడు బాబు. ఒళ్ళూ ముఖం అంతా నెత్తురుమయంగావుంది. బాబును చూస్తూ 'ఏమయిందిరా తండ్రీ!' అంటూ అరుస్తూ మొదలు నరికిన చెట్టులా మాలతి స్పృహలేకుండా పడిపోయింది. మాలతి తల్లి పరిగెత్తుకుంటూవచ్చి కూతురు తల ఒళ్లో పెట్టుకుని దాసీది తెచ్చిన నీళ్ళు ముఖం మీద చిలకరిస్తూవుంది.

దాసీది చెప్పింది. బాబును తీసుకు వెళ్లిన పార్వతి వాళ్ళ మేడమెట్లెక్కుతూ పై మెట్టుమీద కాలు మెలికపడి బాబుతో సహా పైనించి దొల్లుకుంటూ క్రిందకు పడిపోయింది. ఆ పడ్డంలో బాబు తల మెట్లప్రక్క స్తంభానికి తగిలి పచ్చడయింది. అక్కడంతా రక్తం కాల్వలయింది. పార్వతమ్మ కాలు ఎముక విరిగిందనుకుంటున్నారు.

బాబు శరీరం చన్నీళ్ళ కడవలావుంది. ఆ పసివాడి బొందెలో చిలకెప్పుడో ఎగిరిపోయింది. సుభద్ర మతిపోయి ఏం చేస్తూవుందో తెలియకుండానే ఆ ప్రాణంలేని కట్టెను మహేంద్ర ప్రక్కలోవేసింది.

మహేంద్ర అలా విలువ్రగుడ్లతో మాట పలుకులేకుండా చూస్తుండిపోయాడు. గట్టిగా ఏడ్చే ఓపిక కూడా లేదు. చేతికందినపండు జారిపడి చితికిపోయింది. నోటిదగ్గరకు వచ్చిన ముద్దను గ్రద్ద తన్నుకుపోయింది. చలనంలేని బాబును చిక్కిపోయిన చేతుల్లోకి తీసుకుని అక్కున చేర్చుకున్నాడు. అదుముకున్నాడు. నిర్జీవమైన ఆ శరీరాన్ని ఆపాదమస్తకం ముద్దుల్తో నింపివేశాడు. వాడిన తామర తూళ్ళలా వ్రేలాడిపోతున్న ఆ చిన్ని చేతుల్తో మొగం కప్పుకుని లోలోన కుమిలిపోయాడు. మంచుముక్కలావున్న బాబు దేహాన్ని భుజాన వేసుకుని వీపుమీద చిచ్చికొడుతూ మహానందాన్ననుభవిస్తున్నాడు. అణుచుకోలేని శోకభారమతణ్ణి పిచ్చివాణ్ణి చేస్తూవుంది. ఆ మృత శిశుస్పర్శకే అతని సర్వశరీరం పులకించి పోతూవుంది. అది సుఖమో దుఃఖమో తెలియలేని మనస్థితిలో వున్నాడతను. ఏ స్వార్థపంకం, వాంఛా మాలిన్యం, వ్యామోహబంధంలేని శూన్యాకాశంలాగా వుందతని మనస్సు. కన్నీళ్ళు కారిపోతున్నాయి అనుమానాలు ఆక్రోశాలు కోపాలు, తాపాలు, ఆశలు అనుబంధాలు అన్నీ కరిగి ప్రవహిస్తున్నాయి. సమస్త మలినక్షాళితమైన మహేంద్ర మనస్సులో నిక్షిప్తంగావున్న వాత్సల్య సింధువులు అశ్రుబిందువులుగా ఆ పాలిపోయిన చెక్కిళ్ళ మీద పులుకడిగిన ముత్యాల్లా మిలమిలా మెరిసిపోతూ జారి బాబు తలమీదపడి చిట్లిపోతున్నాయి.

కాలమల్లే సాలిగూటిలో చిక్కుబడక తప్పదే పాణికైనా! ఎంత గింజుకున్నా గిజగిజలాడినా ప్రయోజనం శూన్యం. తలుపు తెరిచిన కథ మలుపు తిరిగింది. పాపం! మహేంద్రలో అనురాగం తొలకరించింది. కాని అతణ్ణి అదృష్టం కనికరించలేదు. మనసు పన్నీటి ఊట అయిన మరు క్షణంలో బ్రదుకు కన్నీటిబాట అయింది ●